క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయాలి



పీచుపాలెంలో డ్రెయినేజీ శుభ్రం చేసే పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం: పట్టణంలో అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటేషన్ అధికారులకు సూచించారు. బుధవారం కమిషనర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా లోపాలపై ప్రజలతో మాట్లాడారు. డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగించాలని ఆదేశించారు. ఎక్కడా చెత్తకుప్పలు కనిపించకూడదన్నారు. ఇళ్లలో తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

బోస్ కుటుంబానికి పరామర్శ



భాగ్యలక్ష్మిని పరామర్శిస్తున్న కర్రా జయసరిత

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకుడు, కొంతేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు జక్కంశెట్టి సుభాష్‌చంద్రబోసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బోసు భార్య భాగ్యలక్ష్మి గ్రామ సర్పంచ్‌గా పని చేయడంతో పాటు వైఎస్సార్ సీపీలో చురుకైన నాయకురాలుగా గుర్తింపు పొందారు. దీంతో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయసరిత బుధవారం భాగ్యలక్ష్మిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుసుమే ఝాన్సీ, హేమలత తదితరులున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: డీఎస్సీకి పోటీ పడుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో శిక్షణ ఇవ్వనున్న ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు అవనిగడ్డ కోచింగ్ సెంటర్ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉచిత శిక్షణ కమిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ఎస్ నాగలింగేశ్వరరావు, కన్వీనర్ దీప్తి అప్పారావు, కోఆర్డినేటర్ యు.బంగారుబాబు, బొక్కా రమాకాంత్, రావూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

యలమంచిలి: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మండలంలోని ఊటాడ, యలమంచిలి, అడవిపాలెం గ్రామాలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బుడితి జయరాజు, బర్రే మేరీ ఎంపీటీసీ సభ్యురాలు జిల్లెళ్ల రత్నంరాజు, చిలుకూరి రాజ్యలక్ష్మీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి



సమీక్షా సమావేశంలో డ్వామా పీడీ డా.కేసీహెచ్ అప్పారావు

పాలకొల్లు అర్బన్: ఉపాధి కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త పనులు గుర్తించాలని డ్వామా పీడీ డా.కేసీహెచ్ అప్పారావు అన్నారు. స్థానిక పరిషత్ కార్యాలయ ఆవరణలో యలమంచిలి, పోడూరు, పాలకొల్లు మండలాలకు సంబంధించి ఉపాధి హామీ పనులపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, అలాగే గోకుల షెడ్లు, చెరువుల తవ్వకం తదితర ప్రాధాన్యత పనులను గుర్తించి కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించాలన్నారు. కూలీల వేతనాలు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ఏపీడీలు పి సుజాత, ఏవీవీ వరప్రసాద్, ఎంపీడీవోలు ఎన్ఎస్ ఉమామహేశ్వరరావు, బి మంగాకుమారి, ఈవోపీఆర్డీ తాళ్ల మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలం.. మూగ జీవాలకు గడ్డుకాలం

పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ



మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకలు

యలమంచిలి: మూగజీవాలకు శీతాకాలం గడ్డుకాలంగా పరిణమిస్తుంది. గొర్రెలు, మేకలను ఆరుబయట ఉంచడం వల్ల కొన్ని రకాల వైరస్‌లు సోకి ఎక్కువగా వ్యాధుల బారిన పడుతుంటాయి. సకాలంలో వైద్యం అదించకపోతే చనిపోతుంటాయి. జిల్లాలో 5,35,276 గొర్రెలు, మేకలు ఉండగా వాటిల్లో గొర్రెలు 4,19,314 మేకలు 1,15,962 ఉన్నాయి. జీవాల ఆరోగ్యం విషయంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. పోషణతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలని, వాతావరణం చల్లగా ఉండటం, మంచు కురవడం వల్ల శరీర స్థితి బాగాలేని గొర్రెలు, మేకలు ఈ కాలంలో తొందరగా వ్యాధుల బారిన పడతాయని చెబుతున్నారు. పారుడు, మశూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల వల్ల తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది.

అపరిశుభ్రతతో న్యుమోనియా

జీవాలను ఆరుబయట ఉంచడం, పాకలు పరిశుభ్రంగా లేకపోవడం, దుమ్మూధూళితో నిండి ఉండడం, పాకల్లో పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం వల్ల న్యుమోనియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారడం ఎక్కువగా కనిపిస్తుంది. సరిగ్గా మేత మేయక పోవడం వల్ల జీవాలు నీరసించిపోతాయి. ఒకటి నుంచి తొమ్మిది నెలల వయసున్న గొర్రె, మేక పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తాయి. వ్యాధి నివారణకు గాలి, వెలుతురు బాగా వచ్చే పాకల్లో జీవాలను ఉంచాలి. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్నాకే మందలో కలపాలి.

మసూచి/బొబ్బ రోగం

ఈ వ్యాధి వైరస్ వల్ల ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకల చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్ర జ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంది. శ్వాస సరిగా ఆడక వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పుండ్లపై వేప నూనె లేదా పశు వైద్యులు సూచించిన మందులను పూయాలి.

నీలి నాలుక వ్యాధి

ప్రధానంగా ఈ వ్యాధి గొర్రెల్లో కనిపిస్తుంది. చీకటీగల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. చలికాలంలో చీకటీగలు ఎక్కువగా వృద్ధి చెందుతుంటాయి. గాలి ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరి వ్యాధిని వ్యాపింప జేస్తాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారుతుంది. నోరు, నాలిక వాచి నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడటం వల్ల జీవాలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కాలి గిట్టలు, చర్మం కలిసే దగ్గర వాపు వచ్చి జీవాలు కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే మరణిస్తాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు. జీవాలు ఉండే పాకల దగ్గర మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలి.

తిక్క (సర్వ) రోగం

చలికాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది. వ్యాధిని త్వరగా గుర్తించకపోతే జీవాలు మృతి చెందే అవకాశం ఎక్కువ. పాకాల వద్ద సాయంత్రం పూట వేపాకు ధూపం వేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.

సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి



శీతాకాలంలో సాధారణంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జీవాలు నీరసంగా ఉన్నా, మేత మేయకపోయినా అశ్రద్ధ చేయకుండా వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి. వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. పశు వైద్యుల సూచనలు మేరకు మందులు వాడుతూ సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండల పశు వైద్యాధికారి, యలమంచిలి

ముందు జాగ్రత్తలివే

- గొర్రెలు, మేకలను ఉంచే పాకల్లోకి చలి గాలి రాకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే వాటిని మంచులో, ఆరుబయట ఉంచకూడదు.
- గడ్డిపై మంచు ఆరిన తర్వాత సూర్యరశ్మి వచ్చాక మేతకు విడిచి పెట్టాలి
- ఈతకు వచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి.
- శరీర ఉష్ణ నిర్వహణకు పీచు పదార్థం ఉన్న మేతను అందించాలి.
- గొర్రెలను, మేకలను కట్టే ప్రదేశాలను తరచూ మారుస్తూ ఉండాలి.
- మృతి చెందిన గొర్రెలు, మేకలు తిన్న గడ్డిని, ఆహారాన్ని మిగతా వాటికి వేయకుండా కాల్చి వేయాలి.

లెనిన్‌కు ఘన నివాళి



పెనుగొండలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కార్ల్‌మార్క్స్ శ్రమదోపిడి సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని సోషలిజం సాధించిన పోరాట వీరుడు వీఐ లెనిన్ అని సీపీఎం జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పెనుగొండ సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద లెనిన్‌కు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీలాపు ఆదినారాయణ, కడలి చంద్రకాంత్, వరహాల రెడ్డి, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సురభి నాటకోత్సవాలు

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో 20న ప్రారంభమైన సురభి నాటకోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. గురువారం నాటకోత్సవాలకు చివరి రోజు శ్రీనివాసకళ్యాణం నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అభిమానులు తరలివచ్చి నాటకాన్ని తిలకించాలని కోరారు.

25న చాంబర్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న పాలకొల్లు బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు చెప్పారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు నుంచి 25 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూ ఆధారంగా సుమారు 1000 ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల వయస్సులోపు వారు ఈ జాబ్ మేళాకు నేరుగా హాజరుకావచ్చన్నారు. సమావేశంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కనుమూరి సీతారామరాజు, కోశాధికారి రేపాక ప్రవీణ్‌భాను, అకడమిక్ అడ్వయిజర్ నందుల సీతామారామారావు, స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ పి.లోకమాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కి రూ.63 వేలు అందజేత



డీపీఓ అరుణశ్రీకి రెడ్‌క్రాస్‌కి విరాళం చెక్కును అందజేస్తున్న ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు

పాలకొల్లు అర్బన్: ఆపత్కాలంలో బాధితులను ఆదుకోవడానికి రెడ్‌క్రాస్ సహాయం చేస్తుందని, ఆ రెడ్‌క్రాస్‌కి రూ.6 3వేలు పాలకొల్లు మండలం నుంచి వసూలు చేసి బుధవారం డీపీఓ అరుణశ్రీకి అందజేసినట్లు ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. దీంట్లో చింతపర్రు గ్రామం నుంచి రూ.48 వేలు పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ వసూళ్లు చేసినందుకు డీపీఓ అరుణశ్రీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చందపర్రు పంచాయతీ కార్యదర్శి హర్ష పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీ కేసులో ఆరు నెలల జైలు

భీమవరం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగిలించిన కేసులో ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. గత ఏడాది జరిగిన ఈ ఘటనపై ఎస్సై బి.కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో భీమవరానికి చెందిన బి.మోజేష్‌కు శిక్షను ఖరారు చేస్తూ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పును వెలువరించారు.

అందే మృతి తీరని లోటు



అందే నాగబసవన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు అందే నాగ బసవన్న మృతి తీరని లోటని మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆచంట వేమవరంలో నాగ బసవన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేసిన నాయకుడు అందే అని కొనియాడారు. అదే విధంగా ఆచంట వేమవరంలో ఇటీవల మృతి చెందిన రుద్రాక్షల సోమన్నకు సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుమారుడు సత్యనారాయణకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సర్పంచ్ జక్కంశెట్టి చంటి, కొడమంచిలి రాజు, వీరా భద్రం, కోట వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రామలింగం, కోమటి సూరిబాబు, బళ్లారి నాగేశ్వరరావు, పెచ్చెట్టిసత్యనారాయణ, కొవ్వుల సురేష్, కుక్కల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ యువత సేవా కార్యక్రమాలు భేష్



బాధితుడి భార్యకు చెక్కు అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

నరసాపురం రూరల్: శెట్టిబలిజ యువత చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం నరసాపురం మండలం సీతారామపురంలో కో–ఆపరేటివ్ సొసైటీ కల్యాణ మండపంలో శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ కరోనా అనంతరం సేవా కార్యక్రమాలను చేయడంలో శెట్టిబలిజ యువత ముందుండటం హర్షణీయమన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కడిమి కిరణ్ మణికంఠ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో ఆయన భార్యకు శెట్టిబలిజ యువసేన వాట్సాప్ గ్రూపు ద్వారా సమీకరించిన రూ.2.22 లక్షల చెక్కును బాధితుడి భార్యకు మంత్రి సుభాష్ చేతులమీదుగా అందించారు. శెట్టిబలిజ యువసేన అధ్యక్షుడు గుబ్బల రాజేష్, ట్రెజరర్ గుత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆ బైక్ ర్యాలీలో కనిపించని హెల్మెట్



భీమవరంలో హెల్మెట్ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

భీమవరం: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమంటూ ఓ పక్క పోలీసులు ప్రచారం చేస్తున్నా ప్రభుత్వం చేపట్టిన బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు హెల్మెట్ ధరించకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. సాక్షాత్తు కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలోనే అధికారులు నిబంధనలు పాటించకపోవడం చర్చనీయాంశమైంది. భీమవరంలో బుధవారం బేటీ బఛావో–బేటీ పఢావో(ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం) ప్రచార కార్యక్రమంలో భాగంగా మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ పట్టణంలోని పాతబస్టాండ్ దగ్గరలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుంచి జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సాగింది. ఈ బైక్‌ర్యాలీని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) జెండా ఊపి ప్రారంభించగా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం సాగిన బైక్ ర్యాలీలో దాదాపు 100 మంది వరకు మహిళలు స్వయంగా బైక్‌లో నడుపుతూ పాల్గొన్నారు. అయితే బైక్ నడుపుతున్న మహిళలు కనీసం 10 మంది కూడా హెల్మెట్ ధరించకపోగా పోలీసులు, ఇతర శాఖల అధికారులు అస్సలు పట్టించుకోలేదు. సామాన్య ప్రజలు బైక్ నడిపేటపుడు హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించే పోలీసులు వారి సమక్షంలో జరిగిన బైక్ ర్యాలీలో హెల్మెట్ ధరింపచేయాలనే ఆలోచన లేకపోవడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు.

పండుగ రోజుల్లో మెండుగా ఆదాయం



నరసాపురం బస్టాండ్‌లో బుధవారం ప్రయాణీకుల రద్దీ సాధారణంగా ఉన్న దృశ్యం

నరసాపురం: సంక్రాంతి పండుగ పేరు చెప్పి నరసాపురం ఆర్టీసీ డిపోకు మెండుగా ఆదాయం వచ్చింది. ఈనెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పండుగ సందర్భంగా నరసాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. 94 బస్సులు ద్వారా 149 ట్రిప్పులు వివిధ ప్రాంతాలకు నడిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్, విశాఖపట్టణం ప్రాంతాలకు ప్రతిరోజూ నడిచే సర్వీసస్‌లతో పాటుగా అదనంగా సర్వీసులు ఏర్పాటు చేశారు. దీంతో 12 రోజుల పాటు డిపోకు రూ.26 లక్షలు ఆదాయం వచ్చిందని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి బుధవారం విలేకరులకు చెప్పారు. ఈ 12 రోజులు స్పెషల్ సర్వీస్‌ల ద్వారా 4,987 మంది ప్రయాణించినట్టు వివరించారు. ఇదిలా ఉంటే బుధవారం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పూర్తిగా తగ్గింది. గత రెండు వారాల నుంచి పండుగ సందర్భంగా ప్రయాణికులతో రద్దీగా కనిపించిన బస్టాండ్‌లో సాధారణ రద్దీ నెలకొంది.

రోడ్లపైనే ఆవులు, దూడల సంచారం



తహసీల్దార్ కార్యాలయంరోడ్డుపై పశువులు సంచరిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో రోడ్లపై పశువుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్‌పై ఆవులు, గేదెలు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతునాన్నాయి. దీంతో పారిశుద్ధ్య ఇబ్బందులతో పాటుగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పాడుతున్నాయి. కొన్ని నెలల క్రితం పట్టణంలో ఎక్కడా రోడ్లపై పశువులు, పందులు కనిపించకూడదని మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. పందులను పట్టుకోవడం, రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరికలు కూడా చేశారు. తర్వాత ఈ విషయాన్ని మరిచిపోయారు. రోడ్లపై విచ్చల విడిగా పశువులు సంచరించడంతో బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



మట్లపాలెంలో పశువులకు పరీక్షలు చేస్తున్న పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: మండలంలోని ఇలపకుర్రు, మట్లపాలెం గ్రామాలలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో 86 పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ శిబిరాలను సర్పంచ్‌లు కొండేటి జీవరత్నం, వలవల లక్ష్మీ ప్రారంభించారు. ఈ శిబిరాల నిర్వహణకు పశు సంవర్థక సహాయకులు సతీష్, షబీర, జుజిత, తరుణ్, దుర్గా భవాని, దొరబాబు, వెంకన్నబాబు, వలవల బాలాజీ, హేమలత సహకారం అందించారు.

కొప్పర్రులో పశువైద్య శిబిరం

నరసాపురం రూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని మండలంలోని కొప్పర్రు గ్రామంలో నిర్వహించారు. పశువులకు వివిధ రకాల పరీక్షలు చేసి పెంపకందారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పాల ఉత్పత్తిని ఏ విధంగా పెంచుకోవాలనే విషయాలపై పశువైద్యుడు సురేంద్ర కుమార్ అవగాహన కల్పించారు.

26న భీమవరంలో ఉచిత క్యాన్సర్ శిబిరం

భీమవరం: పట్టణంలోని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదిన ఆనంద ఫంక్షన్ హాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షాశిబిరం, ఉచిత చర్మ సంబంధిత వ్యాధుల శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. బుధవారం వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీహెచ్‌సీలో డయాలసిస్ ప్రారంభం



స్థానిక సీహెచ్‌సీలో తొలి డయాలసిస్ ను పరిశీలిస్తున్న ఐఎంఏ వైద్యులు

ఆకివీడు : స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ ప్రక్రియ బుధవారం ప్రాంభమైంది. మొదటి రోగికి డయాలిసిస్‌ను విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు ఆర్థిక సహాకారంతో నాలుగు డయాలసిస్ యంత్రాలను ఏర్పాటుచేసినట్టు డయాలసిస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ బిలాల్ తెలిపారు. ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసే ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. ఈ ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు 30 మంది తమ పేర్లను ఆసుపత్రిలో నమోదు చేయించుకున్నట్టు తెలిపారు. వారికి అవసరాన్ని బట్టి డయాలసిస్ చేసే తేదీలను వెల్లడిస్తామని చెప్పారు. భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యులు, నెఫ్రాలజిస్టు అశోక్ వర్మ ఆధ్వర్యంలో డయాలసిస్ చేస్తామని తెలిపారు. డయాలసిస్ ప్రారంభ కార్యక్రమాన్ని ఐఎంఏ వైద్య బృందం పరిశీలించిందన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్కేజీ కృష్ణంరాజు చినఅమిరంలో పని చేసిన నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిజమని గుర్తించామని పేర్కొన్నారు. కృష్ణంరాజును అరెస్ట్ చేయాలని ఆదేశించామని తెలిపారు.

అధిక ఎరువుల వినియోగంతో అరిష్టం



రైతులకు సూచనలు చేస్తున్న స్పందన

పెనుగొండ: సాగులో పరిమితికి మించి ఎరువుల వినియోగం వలన పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి స్పంధన అన్నారు. బుధవారం పెనుగొండలో నాట్లు పూర్తి చేసిన వరిచేలను పరిశీలించారు. మండలంలో రబీ సాగుకు ఇప్పటి వరకూ 9720 ఎకరాలలో వరి నాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. రైతులు ఈ–పంట నమోదుకు సహకరించాలని కోరారు.

బాలిక ఆచూకీ గుర్తింపు

భీమవరం: పరిచయస్తుడి మాటలు నమ్మి ఇంటి నుంచి వెళ్లిన మైనర్ బాలికను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మైనర్ బాలిక ఆచూకీ ఈ నెల 17 నుంచి కనిపించలేదు. బంధువుల ఇళ్ల దగ్గర, చుట్టుపక్కల వెతికినా అనంతరం మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో బాలిక తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో సీఐ ఎం.నాగరాజు పర్యవేక్షణలో ఎస్సై కిరణకుమార్, సిబ్బంది బాలిక మొబైల్ లోకేషన్, ప్రత్యేక ఇంటెలిజెన్స్ సమాచారంతో పాలకొల్లు సమీపంలోని బస్టాప్ దగ్గర రాత్రి 1 గంటకు బాలికను గుర్తించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.